andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.2 ၊ కనిష్ఠం 24.4



8

నిర్మల్
జిల్లా వార్తలు

మంగళవారం 3 సెప్టెంబరు 2024



జీఎస్ఆర్ కాలనీని సందర్శించిన అదనపు కలెక్టర్, డీసీసీ అధ్యక్షుడు

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పర్యటన

● అప్రమత్తంగా ఉండాలని సూచన

నిర్మల్ కల్చరల్: జిల్లా కేంద్రంలో సోమవారం భారీ వర్షం కురిసి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఛైర్మన్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు వర్ష ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారు. సిద్దాపూర్‌లో ప్రవహిస్తున్న వాగు పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నందున ప్రమాదం సంభవించే ఆస్కారం ఉండడంతో జీఎస్ఆర్ కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆల్ఫోర్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, కౌన్సిలర్లు, నాయకులు పర్యటించారు.

● జీఎస్ఆర్ కాలనీ సందర్శించిన బీజేపీ నాయకులు

భారీ వర్షాల కారణంగా జీఎస్ఆర్ కాలనీ జలమయమై నీట మునుగగా సోమవారం బీజేపీ నాయకులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఆల్ఫోర్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కాలనీ వాసులను కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే సహకారంతో సాకెర చెక్ డ్యాం ఎత్తు తగ్గించేందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటారన్నారు. జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, నాయకులు అయ్యన్నగారి రాజేందర్, తోట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● సారంగాపూర్ మండలంలోని ధని గ్రామం వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండడంతో నిలిచిన రాకపోకలు



● నిర్మల్-మంచిర్యాల రహదారిపై తర్లపాడ్ వద్ద విరిగిపడ్డ చెట్టును తొలగిస్తున్న పోలీసులు



జిల్లా.. అతలాకుతలం!

కడెం ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తివేసిన దృశ్యం



- జిల్లాలో పొంగిపొర్లుతున్న కడెం, స్వర్ణ ప్రాజెక్టులు.. వాగులు, వంకలు
- దిగువకు భారీగా నీటి విడుదల
- పలుచోట్ల కొట్టుకుపోయిన రోడ్లు, బ్రిడ్జిలు
- చాలా గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- మరోసారి ముంపు గుప్పిట్లో జీఎస్ఆర్ కాలనీ



● కడెం ప్రాజెక్టును సందర్శించిన్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా అంతా అతలాకుతలమయ్యింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొర్లుతున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా వరద నీరంతా లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది. వరదనీటి ఉధృతికి జిల్లాలోని చాలా గ్రామాల రోడ్లు, వంతెనలు తెగిపోయాయి. దీంతో పలు గ్రామాలకు సోమవారం రాకపోకలు సైతం నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా కడెం, స్వర్ణ ప్రాజెక్టులకు వరద ఉధృతి పెరగడంతో అధికారు లు అప్రమత్తమై ఆ ప్రా జెక్టుల వద్దనే ఉండి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా కడెం ప్రాజెక్టుకు గత ఆదివారం రాత్రి నుంచి వరద తారాస్థాయికి పెరిగింది. అధికారులు ఓ దశ లో ప్రాజెక్టు 18 గేట్లను ఎత్తి దిగువకు భారీగా నీటిని వదిలారు. ఉదయం వేకు వజామున ప్రాజెక్టులోకి దాదాపు 2లక్షల 30వేల 704 క్యూ సెక్కుల వరదనీరు రావడంతో అధికారులు అప్రమత్తమై 18 గేట్లను ఎత్తి దిగువకు 3.72 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఉదయం వరకు కూడా వరదనీటి తీవ్రత రిజర్వాయర్‌లోకి కొనసాగింది. ఆ తరువాత అధికారులు గేట్లను క్రమంగా తగ్గించి పది గేట్లను మాత్రమే ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. స్వర్ణ ప్రాజెక్టులోకి కూడా భారీగా వరదనీరు రావడం తో ఆ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు గేట్లను పైకెత్తి నీటిని వదులుతున్నారు. కాగా మధ్యాహ్నం ప్రాజెక్టులోకి 6,300 క్యూసెక్కుల వరదనీరు రావడంతో అధికారులు మూడు గేట్లను ఎత్తి 19,580 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలా రు. పరిస్థితి తీవ్రతను తెలుసుకున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిలలు కడెం ప్రాజెక్టును సందర్శించి అధికారులతో సమీక్ష జరిపారు. దిగువ లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు వరదతీవ్రతను పరిశీలించి దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. గంట గంటకు వరద ఉధృతి పెరుగుతున్న కారణంగా దానికి అనుగుణంగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మల్ పట్టణంలోని జీఎస్ఆర్ కాలనీ కూడా మరోసారి ముంపునకు గురైంది. అలాగే పట్టణంలోని చాలా వార్డులు జలమయమయ్యాయి.

తెగిన రోడ్లు, వంతెనలు

ఇదిలా ఉండగా.. వరద ఉధృతికి చాలా గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే పలుచోట్ల రోడ్లతో పాటు బ్రిడ్జిలు సైతం కొట్టుకుపోయాయి. గంటల పాటు వరదనీరు రోడ్లపై ప్రవహించడంతో అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. లక్ష్మణచాంద మండలంలోని ధర్మారం, సోన్ గ్రామాల మధ్య గల బ్రిడ్జి కొట్టుకుపోవడంతో ఈ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఇదే మండలంలోని తిరుపెల్లి వాగు బ్రిడ్జి కూడా తెగిపోయింది. సదర్‌మాట్ బ్యారేజీ వద్ద అలాగే బాసర గోదావరి వద్ద వరద ఉధృతి తీవ్రంగా మారింది. సారంగాపూర్ మండలంలోని ధని గ్రామం వద్ద వాగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెంబి మండలంలోని కడెం వాగు, దొత్తివాగుల ఉధృతి కారణంగా అంకెన, రాయధారి, పోచంపెల్లి, యాపల్ గూ డ, రాంనగర్, గుమ్మెన ఎంగ్లాపూర్, దొందరి, రాముగూడ, పస్పుల్లా, హరిచంద్‌తండా, వస్‌పెల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మల్- మంచిర్యాల రోడ్డుపై గల తర్లపాడ్ వద్ద చెట్టు విరిగిపడడంతో రాకపోకలు ఆగిపోయాయి. అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకొని చెట్టును తొలగించారు.

మళ్లీ ముంపు గుప్పిట్లో జీఎస్ఆర్ కాలనీ

ప్రతియేటా ముంపునకు గురవుతున్న జీఎస్ఆర్ కాలనీ మళ్లీ ఆ ప్రమాదంలోనే చిక్కుకుంది. స్వర్ణ ప్రాజెక్టు నుంచి దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తున్న కారణంగా స్వర్ణ వాగు పక్కనే ఉన్న ఈ జీఎస్ఆర్ కాలనీ.. మళ్లీ వరద ఉధృతికి గురయ్యే ప్రమాదం ఏర్పడింది. ఆదివారం రాత్రి నుంచి వరదనీరు కాలనీలోకి ప్రవేశించి క్రమంగా నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకొని కాలనీ వాసులను పునరావాస కేంద్రానికి తరలించారు. అలాగే సోమవారం బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌లు వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి కాలనీవాసులతో మాట్లాడుతూ ఎవరూ భయపడవద్దని, అండగా ఉంటామంటూ భరోసా కల్పించారు. అలాగే కొద్దిరోజుల్లోనే స్వర్ణ వాగులోని చెక్‌డ్యాంను తొలగించే పనులు మొదలవుతాయని, దీంతో శాశ్వతంగా వరద ప్రమాదం జీఎస్ఆర్ కాలనీకి తప్పుతుందంటూ తెలిపారు.

అప్రమత్తమైన జిల్లా అధికారులు

వర్షాల తీవ్రత తగ్గపోతుండడం, వరద ఉధృతి కొనసాగుతుండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు అదనపు కలెక్టర్‌లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఎస్పీ జానకి షర్మిల వరద ప్రాంతాలను సందర్శించి అవసరమైన మేరకు చర్యలు చేపడుతున్నారు. బాధితులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని, ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉం టుందంటూ భరోసానిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్, ఎస్పీలు కడెం, స్వర్ణ ప్రాజెక్టులను సందర్శించి అక్కడ అధికారులతో సమీక్షలు జరిపారు. అలాగే పలు ముంపు గ్రామాలను సందర్శించారు. తెగిపోయిన రోడ్లను పరిశీలించారు. నిలిచిపోయిన రాకపోకలను పునరుద్ధరింపజేశారు. ఇదిలా ఉండగా వర్షాల ఉధృతి తగ్గకపోవడంతో మంగళవారం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మళ్లీ సెలవు ప్రకటించారు. వర్షాల కారణంగా సోమవారం కూడా సెలవును ప్రకటించిన ప్రభుత్వం.. దానిని మరోరోజుకు పొడగించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వర్షాల సమయంలో ఇంటి నుంచి బయటకు రావొద్దంటూ వారు సూచిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రమాదకరంగా మారిన తిరుపెల్లి బ్రిడ్జి



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎస్సై

లక్ష్మణచాంద, సెప్టెంబరు 2 : మండలంలోని తిరుపెల్లి-లక్ష్మణచాంద గ్రామాల మధ్యం తిరుపెల్లి సమీపంలో వాగుపై ఉన్న బ్రిడ్జి పాక్షికంగా కొట్టుకుపోయి ప్రమాదభరితంగా తయారైంది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో రాధారాథోడ్, ఎస్సై సుమలత బ్రిడ్జి వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బ్రిడ్జి పై నుంచి కొనసాగించే రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. బ్రిడ్జి పరిస్థితిపై పైఅధికారులకు నివేదిక సమర్పిస్తామని, బ్రిడ్జిపై తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గంటకొకసారి గ్రామంలో చాటింపు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు విక్రమ్‌రాజ్, వీణ, తదితరులున్నారు.


ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటాం

- గత ఏడాది పరిస్థితి పునరావృతం కానివ్వలేదు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- కడెం ప్రాజెక్టు సందర్శన



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు





కడెం, స్వర్ణ ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల

ఖానాపూర్, సెప్టెంబరు 2 : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌లతో కలిసి కడెం ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా కడెం ప్రాజెక్టు వద్ద గత ఏడాది పరిస్థితి పునరావృతం కాకుండా తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుమారు రూ. 10 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం కడెం ప్రాజెక్టుకు 2.30 లక్షల భారీ వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు మొత్తం 18 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. గేట్లు ఎత్తిన సమయంలో, వరదల సమయంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులోని వరద నీరు ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతా ల కు తరలించాలన్నారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలె త్తకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు. కలెక్టర్ కార్యాల యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అద నపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవో రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి అధికారులు, పాల్గొన్నారు. అంతకు ముందు సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల సహా పలువురు అధికారులు కడెం ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

సారంగాపూర్ : మహారాష్ట్రలో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి 10,100 క్యూసెక్కుల రవద నీరును దిగువ ప్రాంతానికి వదిలిపెట్టారు. ప్రస్తుతం 6,280 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. అలాగే చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో స్వర్ణ వాగు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు తెలిపారు.

బిట్ కాయిన్ వ్యవహారంలో ఇద్దరి సస్పెన్షన్

- మరికొందరి కోసం పోలీసుల వేట
- అజ్ఞాతంలోకి వెళ్లిన గొలుసు దందా నిర్వాహకులు..?

నిర్మల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బిట్ కాయిన్ మల్టీ లెవెల్ గొలుసు దందా వ్యవహారంలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను తాజాగా సోమవారం విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేయడం కలకలం రేపుతున్నది. జిల్లాలో సంచలనం సృష్టించిన బిట్ కాయిన్ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌లో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఏ.రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిణామం ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర సంచలనం రేపింది. బిట్‌కాయిన్ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌లో ప్రమేయం నేపథ్యంలో ఆదివారం పోలీసులు రిమాండ్‌కు తరలించిన ఇద్దరు ఉపాధ్యాయులు బూస సాయి కిరణ్ (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ మొర్రిగూడ, కడెం మండలం), కండెల నరేష్ (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ గంగాపూర్, కడెం మండలం)లను పోలీసుల రిమాండ్ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కాగా ఈ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. అయితే పోలీసులు మరికొందరి కోసం వేట మొదలుపెట్టినట్లు తెలిసింది. అరెస్టు అయిన వారు ఇచ్చిన సమాచారం మేరకు స్టార్ రేటింగ్ ఉన్న కొందరిని పట్టుకొని అరెస్టు చేస్తారని ప్రచారం మొదలైంది. దీంతో కొందరు ఉద్యోగాలకు సెలవు పెట్టి సెల్‌ఫోన్లు ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని తెలిసింది.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినులు

ముథోల్, సెప్టెంబరు 2 : ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆగస్టు 31, సెప్టెంబరు 1, 2వ తేదీలలో చొక్కా రాంపూర్, మంచిర్యాల జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అటల పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సారథి రాజు తెలిపారు. 10వ తరగతి చదువుతున్న ఆర్. ప్రత్యూష అండర్-17 ట్రిపుల్ జంప్‌లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం ప్రశంసాపత్రం పొందిందని, 100 మీటర్ల హార్డిల్స్‌లో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. బి.వీణ అండర్-14 హార్డిల్స్‌లో తృతీయ స్థానం, ఎస్. సారిక అండర్-14 హై జంప్‌లో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా వీరికి ప్రబంధకారిణి సభ్యులు, ప్రధానాచార్యులు, ఆచార్యులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలకు నేడు సెలవు : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 2 : నిర్మల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని అన్ని పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విద్యా సంస్థలు సెలవు పాటించాలని సూచించారు.

బాసర వద్ద ఉధృతంగా గోదావరి



బాసర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

బాసర, సెప్టెంబర్, 2: బాసర వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇక్కడతో పాటు ఎగువ మహారాష్ట్రలో భారీగా వర్షాలు కురు స్తుండడంతో నీటి ప్రవాహం పెరిగింది. సోమవారం రెండు లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. నది నిండుగా దిగువకు శ్రీరాంసాగర్ వైపు పరుగు పెడుతోంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమేపి నదిలో ఇన్‌ఫ్లో పెరుగుతూ వచ్చింది. ఇన్‌ఫ్లో పెరగడంతో శ్రీరాంసాగర్ 28 గేట్లు ఎత్తి దిగువరకు వరద నీరు వదలడం ప్రారం భించారు. మరో ఒక్కటి రెండు నదిలో నీటి ప్రవాహం ఇదే స్థాయిలో ఉం డే అవకాశం ఉంది. బాసర వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవ హించడంతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. ముథోల్ సీఐ మల్లేష్, తహసీల్దార్ పవన్ చంద్ర, గ్రామ కార్యదర్శి గోవిందరాజు, ఎస్ఐ గణేష్ నదీ తీర ప్రాంతంలో పర్యటించారు. నది పరివాహక ప్రాంత సాగు రైతులకు, జాలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వీలులేని చోట్ల స్నానఘట్టాల వద్ద నిలిపి వేశారు. అడ్డుగా గ్రీన్ మ్యాట్ కట్టి భక్తులు లోనికి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. స్నానాల కోసం నదిలోకి వెళ్లకుండా ఆలయ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీటి విడుదల



గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు



ఫ్యాక్టరీలో నిలిపి ఉంచిన ఆర్‌టీసీ బస్సులు

భైంసా, సెప్టెంబరు 2 : భారీ వర్షాలతో గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి అధిక మొత్తంలో వరద నీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో ఆదివారం ప్రారంభమైన వరద గేట్ల ద్వారా నీటి విడుదల సోమవారం కొనసాగింది. ఆదివారం 24.625 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా ప్రాజెక్టుకు సంబంధించిన మూడు వరద గేట్లను ఎత్తివేసి సుద్దవాగులోకి 30 వేల క్యూసెక్కుల వరద నీటి విడుదల చేశారు. సోమవారం ఉదయం వరద నీటి చేరిక 24 వేల క్యూసెక్కుల నుంచి 12 వేల క్యూసెక్కులకు తగ్గుముఖం పట్టింది. అయితే అధికారులు మూడు వరద గేట్ల ద్వారా నీటి వదిలివేతను అలాగే కొనసాగించారు. వరద నీటి చేరికకు అనుగుణంగా మూడు వరద గేట్ల ద్వారా 12 వేల క్యూసెక్కుల నీటిని సుద్దవాగులోకి వదిలివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు ఉండగా సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రాజెక్టు నీటి మట్టం 358 మీటర్లుగా నమోదు అయింది. .

● **బస్సుల తరలింపు**

గత సంవత్సరం గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరద నీటి విడుదలతో ఇక్కడి బస్సు డిపో ముంపు బారిన పడి అధికంగా నష్టం వాటిల్లింది. ఆదివారం ప్రాజెక్టు నీటి విడుదల జరిగిన నేపథ్యంలో ఆర్‌టీసీ అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించారు. బస్సులను కమల జిన్నింగ్ ఫ్యాక్టరీకి తరలించారు.

● అధికారుల జాగరణ

నీటి విడుదలతో ముంపు ప్రాంతాల్లో ఎలాంటి కష్టనష్టాలు వాటిల్లకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించింది. ఖాన్ ఆటోనగర్, బైపాస్ రోడ్డు మార్గం, భట్టిగల్లి హన్మాన్ మందిర ప్రాంతం, వినాయక్ నగర్, రాహుల్‌నగర్ ప్రాంతాలకు ముంపు సమస్య ఏర్పడింది. మూడు శాఖలకు చెందిన అధికారులు రాత్రంతా పనిచేసి ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

కుంటాలలో

రెండో రోజూ.. ఆగని వరద

కుంటాల, సెప్టెంబర్, 2: కుంటాల మండలంలో శనివారం రాత్రి నుంచి సోమవారం వరకు భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా మండలంలోని ఓలా నుంచి సూర్యాపూర్, మెదన్ పూర్ గ్రామాలకు వెళ్లే రహదారిలో ఓలా గ్రామం ప్రక్కన గల లోలెవల్ వంతెన పై నుండి నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది అంతేగాకుండా వెంకూర్ చెరువు అలుగుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షపు నీరు వృథాగా వెళ్లిపోతూ ఈ ప్రవాహం ఉధృతికి దిగువ ఉన్న కొత్త వెంకూర్, పాత వెంకూర్ గ్రామాల మధ్యన గల లోలెవల్ వంతెన పై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తూ రైతుల పత్తి, సోయా పంటలు దెబ్బతింటున్నాయి. రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని అన్ని గ్రామాలలో గల రైతుల యొక్క పత్తి, సోయా పంటలలో వర్షపు నీరు నిలిచింది



వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు

భక్తులకు అన్నదానం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 2: మండలంలోని సిద్దేశ్వర ఆలయంలో చివరి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం ఒక్క నెల ఉపవాస దీక్షలు చేసిన భక్తులు చివరి సోమవారం ముగించారు. భక్తులకు బూరుగుపల్లి(కె) గ్రామానికి చెందిన జాదవ్ మెతిలాల్ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయంలో భక్తిపాటలు, తబలా వాయిద్యాలు అలరించాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైఎస్ఆర్ వర్ధంతి

● ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 2: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ శ్రేణులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా జరుపుకొన్నారు. సోమవారం ప్రజాసేవ భవన్‌లో వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కాంగ్రెస్ కమిటీ ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ మాట్లాడుతూ.. జిల్లాకు రిమ్స్ ఆసుపత్రిని ఇచ్చి పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చిన ఘనత దివంగత నేత వైఎస్‌కు దక్కుతుందన్నారు. ఆరోగ్య పరంగా పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యశ్రీ, 108 వాహనాలను అందుబాటులోకి తెచ్చారన్నారు వైఎస్ఆర్ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులంతా ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జహీర్ రంజాని, కలాల శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మణ్, భూమన్న, నాయకులు పాల్గొన్నారు

పేదల గుండెల్లో రాజన్న పదిలం..

నేరడిగొండ: పేదల గుండెల్లో రాజన్న పదిలంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, బోథ్ వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ ఆడేవసంత్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేరడిగొండ మండల అధ్యక్షుడు, బోథ్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆడేవసంతరావు, బోథ్ బ్లాక్ ప్రెసిడెంట్ ప్రఫుల్‌రెడ్డి, బోథ్ సెంబ్లి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దంపోతారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాయిడి రవి, జిల్లా సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళులు..

నిర్మల్ కల్చరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం నిర్మల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఘన నివాళులర్పించింది. డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, విద్యార్థులు ఫీజ్ రీయింబర్స్‌మెంట్, రైతు రుణమాఫీ, తదితర పథకాలు ఆయన హయాంలో ప్రారంభించారన్నారు. ప్రజల గుండెల్లో వైఎస్ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. నాయకులు పాల్గొన్నారు.

'రెండు లక్షల రుణమాఫీ చేయాలి'

నార్నూర్, సెప్టెంబరు 2: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసినా మాకు ఇంకా వర్తింప కాలేదు అంటూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు రైతువేదిక కార్యాలయం వద్ద వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రుణమాఫీ చేయాలని కోరారు. కొత్త రుణాలు కావాలని బ్యాంక్ సిబ్బందిని కోరితే వారు ఇంకా మీరు తీసుకున్న పాత బకాయిలకు ఇంకా మాఫీ వర్తించ లేదని, వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అనడంతో వారు లబోదిబో మంటూ రైతు వేదికల దగ్గర పోయి అధికారులు కలిసి రెండు లక్షల రుణమాఫీ చేయాలని దరఖాస్తు చేస్తున్నారు. అసలు మాకు రుణమాఫీ వర్తిస్తుందా లేదా అనేది అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పెట్టినా కొన్ని నియమ నిబంధనలు వలన మాకు ఇబ్బంది అవుతోంది.. అసలు మా పాత బకాయిలు కట్టడం మా వల్ల కాదు, కట్టలేము కూడా ఇప్పుడు మీరు ఇచ్చిన హామీ రెండు లక్షలు మాకు మాఫీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతు న్నారు. మండలానికి మాఫీ కాని రైతుల పట్టాపాస్ బుక్ ఆధార్‌బ్యాంకు, పాస్‌బుక్, ఇతర అంశాల వివరాలు ఇప్పటి వరకు దరఖాస్తులు 255 రైతులు ఇచ్చినట్లుగా అధికారులు తెలిపారు.

అతిథి అధ్యాపకుల ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, సెప్టెంబరు 2: మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ 1, తెలుగు 2, హిందీ 1, హిస్టరీ 1, ఎకనామిక్స్ 2, పొలిటికల్ సైన్స్ 1,కామర్స్ 2, గణితం 2, భౌతిక శాస్త్రం 3, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్ 1, జువాలజీ1 సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నాయని,అభ్యర్థులు సంబంధిత పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులున్న వారు అర్హులన్నారు.నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉందని,బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రం సమర్పిస్తే వెయిటేజీ ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో ఈ నెల4లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, 6న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించబడుతాయని ప్రిన్సిపల్ తెలిపారు. పూర్తి వివరాలను 70759 99789, 9490452742 సంప్రదించగలరని కోరారు.

వరద విపత్తు పై సర్వే చేయాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్

జైనథ్, సెప్టెంబరు 2: ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేప థ్యంలో వరద విపత్తుపై సర్కారు వెంటనే సర్వే చేయాలని ఆదిలా బాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని పెన్‌గంగా వరద ముంపు గ్రామాలైన ఆనంద్‌పూర్, కూర గ్రామాలతో పాటు బేల మండంలోని పెన్‌గంగా వరద ముంపు గ్రామా లను అధికారులు నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ ఇలాంటి వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం జర గాలంటే ఫసల్ భీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయా లని డిమాండ్ చేశారు. పెన్‌గంగా పరివాహక గ్రామాల్లో రైతులు వేసిన వివిధ పంటల వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వాపోయారు. నీట మునిగిన పంటలను చూసి ఎమ్మెల్యే దిగ్భ్రాంతికి లోనయ్యారు. అధికారులు వైపరిత్యాల పై తక్షనం సర్వే నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించాలన్నారు. నష్టపోయిన పంటలకు ఎకరంకు రూ.40వేల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ అధ్యక్షులు దయాకర్,మండల అధ్యక్షులు ఏనుగు రాకేష్ రెడ్డి, నాయకులు ము కుంద్‌రావు, భూమన్న, ఎంపీటీసీ కరుణాకర్‌రెడ్డి, విజయ్, విశాల్, డికేం దర్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు, జైన థ్, బేల మండలాల పెన్‌గంగా ముంపు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఇబ్బందులు

సిరికొండ, సెప్టెంబరు 2 : మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం స్థంభిం చిపో యింది. గిరిజన గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకుల నిమిత్తం మండల కేంద్రానికి చేరుకో వాలంటే నానాఅవస్థలు ఎదు ర్కొంటున్నారు. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో పలు కల్వర్టులు, రోడ్లు కోతకు గురికా వడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గత రెండురోజులుగా ఆది వాసీ గ్రామాల్లో కరెంట్ లేకపోవడంతో చీకట్లోనే కాలం వెల్లదీస్తున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జీ ఆత్రం సు గుణ మండలంలోని రాంపూర్(బి)లో వరదలకు పంటపోలాలను, ధ్వంసమైన రహదారులను పరిశీలించి ప్రజలు పలు సూచనలు చేశారు. పంట నష్టంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని సుగుణ రైతులకు బరోసా కల్పించారు. వరదల బారిన పడకుండా ప్రజలు స్వీయనియంత్రణ పాటిం చాలని ఆమె సూచించారు.

తాంసిలో కుండపోత

తాంసి, సెప్టెంబరు 2: మళ్లీ కుండపోత వర్షం కురుస్తుంది. నిన్నటి వరకు ఏకదాటిగా కురిసిన వర్షంతో ఇబ్బందులు పడ్డ జనానికి సోమవారం మధ్యా హ్నం నుంచి మళ్ళీ భారీ వర్షం కురుస్తుండటంతో వా గులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పంట భూములన్నీ జౌకు పడు తున్నాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా వర్షం కురిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపోయాయి. మత్తడి వాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. మండల కేంద్రంలో ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహించింది. గ్రామ సమీపం వరకు నీళ్ళు రావడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంతో ప్రజలు పరుగులు తీశారు. పొన్నారి, కప్పర్ల, హస్నాపూర్ వాగు లు సైతం పొంగిపొర్లాయి. పంట పొలాల్లోకి భారీ వరద నీరు చేరడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని మండల రైతులు కోరుతు న్నారు.

కొట్టుకుపోయిన పత్తి, సోయా పంటలు

ఇంద్రవెల్లి , సెప్టెంబరు 2 : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో రాత్రి నుం చి సోమవారం తెల్లవారు జామున వరకు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి వరద నీటితో వాగులు, చెరువులు పొంగిపొర్లాయి.

ఎడతెరిపి లేని వర్షం.. పంటలకు నష్టం

ఉట్నూర్, సెప్టెంబరు 2: ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఏకదాటిగా కురిసిన వర్షంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. ఉట్నూర్ మండలంలో 165 మి.మీలు, ఇంద్రవెల్లి మండలంలో 180మి.మీలు, గాదిగూడలో 117.6 మి.మీలు, నార్నూర్ మండలంలో 89.4 మి.మీల వర్షపాతం నమోదైంది. ఆదివారం నుంచి కురుస్తున్న వర్షానికి రైతులు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్, జైత్రంతండా, పులిమడుగు దంతనపల్లి, కొత్తగూడ, వంకతుమ్మ, గంగాపూర్, నాగపూర్, ఏందా ప్రాంతాలలోని వాగులు పొంగి ప్రవహించడంతో వాగు పరివాహ ప్రాంతాలలో ఉన్న రైతుల పంట పొలాలు వరద నీటికి కొట్టుక పోయాయి. జైత్రంతండా వాగు వద్ద 50 ఎకరాలలో మొక్కజొన్న, పత్తి పంట కొట్టుక పోయిందని మాజీ ఎంపీటీసీ రాథోడ్‌పరశురాం తెలిపారు. కొత్తగూడ వాగు సమీపంలో లచ్చన్నకు చెందిన రెండు ఎకరాల పత్తి, గట్టయ్యకు చెందిన ఒక ఎకరం పత్తి, రమేష్‌కు చెందిన ఒక ఎకరం పత్తి పంటలు వరద నీటికి ముంపుకు గురై చెట్లు వంగిపోయాయి. మండలంలోని దొంగచింతసమీపంలో వంతెన వద్ద వరద నీటి ప్రవాహానికి ఒక పక్క రోడ్డు కొట్టుకు పోయింది.కుమ్మరికుంట రోడ్డు పై వరద నీరు ప్రవహిస్తుండడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలు నష్టపోయినందున రైతుల పంట వివివరాలు వెంటనే నమోదు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని బస్టాండ్, అంబేద్కర్‌చౌరస్తా మధ్య ఉన్న ప్రధాన రోడ్డు పై వరద నీరు చేరడంతో వాహనాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. శాంతినగర్, నవోదయనగర్ ప్రాంతాలలోని ప్రజల ఇండ్లలోకి వరద నీరు చేరడంతో పేద ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

విషయం తెలుసుకున్న ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, ఆర్డీఓ జివాకర్‌రెడ్డిలు నీరు నిలుచున్న ప్రాంతానికి చేరుకుని జేసీబీ సహాయంతో నీటిని తొలగించి కాలువల ద్వారా గోపాయచెరువులోకి పంపించాలని ఆదేశించారు. లక్కేటిపేట్ వెళ్లే బ్రిడ్జి డ్యామేజ్ అయినందున అక్కడ రోడ్డు పూర్తి స్థాయిలో కోతకు గురై వాహనాలు వెళ్లలేకుండా ఉండడంతో అక్కడ వెంటనే రాకపోకలు మనుషులు నడిచే విధంగా కొద్ది రోడ్డును మరమ్మత్తులు చేయించడం జరిగిందని ఉట్నూర్ ఎంపీడీఓ రాంప్రసాద్, ఎంపీఓ మహేశ్‌కుమార్‌లు చర్యలు తీసుకున్నారు.

'వ్యవసాయ కోర్సుల వైపు అడుగులు వేయాలి'

మావల, సెప్టెంబరు 2: యువత వ్యవసాయంపై ఆసక్తి కలిగి ఉండి బీఎస్సీ అగ్రికల్చర్ వంటి కోర్సుల్లో చేరడం ద్వారా మంచి భవిష్యత్తును పొందవచ్చునని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి సూచిం చారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అగ్రికల్చర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు కళాశాల విద్యార్థులచే స్మార్ట్ అగ్రికల్చర్, సస్టైన్ అగ్రికల్చర్, ఆర్గానిక్ ఫార్మింగ్, డ్రిఫ్ట్ ఇరిగేషన్, హైడ్రో ఫోనిక్ సిస్టమ్, పాలీ హౌస్ వంటి అంశాలపై ఏర్పాటు చేసిన ప్రజెంటేషన్ ను సందర్శించి పలు వివరాలు అడిగి తెలుసుకుని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయకళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ శ్రీధర్ చౌహాన్, కేవీకే ఆదిలాబాద్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్రావు, వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ రాంప్రసాద్, ప్రొఫెసర్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు వీక్కి, గోవర్ధన్ యాదవ్, లక్ష్మణ్, అగ్రికల్చర్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సాయి లింగలో ఒకరికి డెంగ్యూ

● విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన

తలమడుగు, సెప్టెంబరు 2: మండలంలోని సాయిలింగి గ్రామంలో ఒకరికి డెం గ్యూ జ్వరం రావడంతో వైద్య సిబ్బంది స్పందించి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పా టు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో విష జ్వరాలు విజృం భిస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన కోరారు. మండలంలోని సాయి లింగ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగి గ్రామానికి చెందిన ఒకరికి డెంగ్యూ జ్వరం వచ్చిందని వైద్య పరీక్షల్లో తేలడంతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు సోకిన వెం టనే గ్రామీణ ప్రజలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా పరిసరాల ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇంటి వద్ద ఇలాంటి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అంతేకా కుండా గ్రామాలలో గల రక్షిత మంచి వాటర్ ట్యాంకులను వారానికి మూడుసార్లు శుభ్రం చేయాలన్నారు. అనంతరం గ్రామంలోనరి పలు వీధుల గుండా పర్య టించి పారిశుధ్యాన్ని సంపూర్ణంగా నిర్మించాలని ఆదేశించారు. ఇందులో ఎంపీ డీవో చం ద్రశేఖర్, వైద్యాధి కారి డాక్టర్ హరీష్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్య దర్శులు, గ్రామస్థులు, తది తరులు పాల్గొన్నారు.

దీక్ష శిబిరంలో పొలాల పండుగ

దిలావర్‌పూర్, సెప్టెంబరు 2 : రైతుల నేస్తం బసవన్నను కొలిచే పొలాల అమా వాస్య పండుగను రైతులు వినూత్నంగా జరుపుకున్నారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మా ణాన్ని వ్యతిరేకిస్తూ రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 42 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతులు దీక్ష శిబిరంలోనే బసవన్నల ప్రతి మలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించారు.

పొంగిన వాగులు




వర్షందాటికి నేలమట్టమైన పంట చేను

నేరడిగొండ సెప్టెంబరు 2: గత మూడు రోజులుగా కురుస్తున్న ముసురుతో మండలం తడిసి ముద్దయ్యింది ఎడతేరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. వాగులు వంకలు పొంగి పోర్లడంతో పంట పోలాల్లో నీరు చేరి పంటకు నష్టం వాటిల్లెతోందని ప్రజలు పేర్కోంటున్నారు. కాగా అదికంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు పాత బడిన ఇండ్లలో ఉండవద్దని బోథ్ ఎమ్యేల్యే అనిల్ జాదవ్, తహసిల్దార్ కలీం, ఇచ్చోడ సిఐ భిమేష్, ఎస్ఐ శ్రీకాంత్‌లు కోరుతున్నారు. వర్షాలతో రోగా లు ప్రబలే ఆవకాసం ఉంటున్నందున ప్రజలు పరిసరాల శుభ్రతతో పాటు శారీరక శుభ్రత పాటిస్తు వేడి వేడి పదార్థాలనే తినుకోవాలని కోరుతున్నారు. మండలంలోని సేవాదాస్ నగర్. చింతగూడ గ్రామానికి వేళ్ళే రహదారిపై గల వంతేన పోంగి పోర్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సరైన వంతేన లేక పోవడంతో మండల కేం ద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సంబదిత అదికారులు పాలకులు స్పందించి వంతేన నిర్మాణం చేపట్టాలని ఆగ్రామాల ప్రజలు కోరుతున్నారు. కుంటాల జలపాతానికి వరద నీరు పోటెత్తడంతో ఆటవీశాఖ అధికారులు జలపాతాన్ని తిలకించేందుకు పర్యాటకులకు అనుమతులు నిలిపి వేశారు.

జిల్లాకు చేరుకున్న సైకిల్ ర్యాలీ

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 2: ప్రస్తుత కాలంలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని టెరి టోరియల్ ఆర్మీ మేజర్ అభయ్‌జిత్ సింగ్ అన్నారు. టెరిటోరియల్ ఆర్మీ 75వ వసంతాలను పురస్కరించుకొని సియాచిన్‌గ్లేషియర్ నుంచి జూలై 30న చేపట్టిన సైకిల్ ర్యాలీ సోమవారం ఆదిలాబాద్ జిల్లాకు చేరుకుంది. ఈ ర్యాలికి ఎన్‌సీసీ కెప్టెన్ గాలి అశోక్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనం తరం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎన్‌సీసీ కెడెట్లతో ఆర్మీ అధికారులు సమావేశమయ్యారు. సైకిల్‌యాత్ర ఉద్దేశ్యం, ఆరోగ్యం, పర్యావరణం గురించి కెడెట్లకు తెలియజేశారు.

పెచ్చులూడుతున్న పాఠశాలల పైకప్పు



పాఠశాలలో పెచ్చులూడి ఉన్న దృశ్యం

నార్నూర్, సెప్టెంబరు 2: గత కొన్ని నెలల నుం చి కురుస్తున్న భారీ వర్షా లకు కారణంగా మండ లంలోని మాంజరి గ్రా మంలో ఉన్న టీడబ్ల్యు పీ ఎస్ పాఠశాల పైకప్పుతో పా టు గోడలకు నీళ్లిం కాయి. పైకప్పు వర్షానికి స్లాబు పెచ్చులు ఊడి పోతుఉన్నాయి. పాఠ శాల లో 12 మందికి పైగా చిన్నా రులున్నారు. అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాల కింద మంజూరైన నిధులతో పాఠశాలకు చేయాల్సిన పనులు సంబంధిత కాంట్రాక్టర్లు పని సరిగ్గా చేయడం లేనందున గ్రామ స్థులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఐటీడీఏ ప్రభుత్వ శాఖ స్పందించి సమస్యని పరిష్కారం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తాంసి, సెప్టెంబరు 2: ప్రస్తుతం వర్షాకాలం అయినందున పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలని మండల అభివృద్ధి అధికారి గడ్డం మోహన్ రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం గిరిగావ్, జామిడి, గ్రామాలలో అధికారుల బృందం పర్యటించింది. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. మురికినీరు నిలువ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏవైనా వ్యాధులు సోకితే వెంటనే ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి వారం తాగునీటి కుళాయిల్లో క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాము కాటుకు రెండు ఆవులు, లేగ దూడ మృతి

తాంసి, సెప్టెంబరు 2 : రెండు రోజుల నుంచి మండల కేంద్రంలో పాము లు కాటేయడంతో రెండు ఆవులు, ఒక లేగ దూడ మృతి చెందింది. సోమ వారం మధ్యాహ్నం మేతకు వెళ్లిన లేగ దూడకు పాము కాటేయంతో నడి రోడ్డు పైనే మృతిచెందింది. ఇది ఎవరిది అనే విషయం ఇంకా తెలియలేదు. మండల కేంద్రానికి చెందిన కళ్లెం గంగారెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన ఆవులు సైతం పాముకాటుకు గురై మృతిచెందాయి.

గిరిగావ్‌లో డెంగీ..

తాంసి, సెప్టెంబరు 2: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తోడు గ్రామాలన్నీ బురదమయం అవుతున్నాయి. దీంతో దోమల తీవ్రత ఎక్కువై విష జ్వరాలు, డెంగీ సోకుతోంది. మండలంలోని గిరిగావ్ గ్రామం లో ఒకరికి డెంగ్యూ వ్యాధి సోకి మంచం పట్టారు. విషయాన్ని తెలు సుకు న్న అధికార బృందం సోమవారం మధ్యాహ్నం డెంగ్యూ సోకిన కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. వ్యాధికి గల కారణాలను పరిశీ లించారు. అలాగే మండలంలోని చాలా గ్రామాలలో విషజ్వరాల బారిన పడి జనం మంచం పడుతున్నారు.

'లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

భీంపూర్, సెప్టెంబరు 2: పెన్ గంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని భీంపూర్ ఎస్ఐ మహ్మద్ ఖలీం సూచించారు. ఆయన సిబ్బందితో కలిసి సోమవారం మండలంలోని అంతర్గంలో పెన్ గంగా పరి వాహక ప్రాంతాన్ని సందర్శించారు. గుబ్డి, గోముత్రి, అంతర్గం, అర్లి(టి), వడూర్, గొల్లగడ్, తాంసి(కె) లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. పెన్‌గం గా ప్రవాహం ఉధృతి ఎక్కువగా ఉంటే తన నెంబర్ 9989598010కి సమా చారం అందించాలని భీంపూర్ తహసీల్దార్ సత్యనారాయణ రావు అన్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి

తాంసి, సెప్టెంబరు 2 : మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన బొజ్జ రవీందర్ (29) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉరి వేసుకుని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొంత కాలంగా భార్య రాకపోవడంతో మనస్థాపానికి గురైన ఈయన సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తాంసి ఎస్ఐ శివరాం పేర్కొన్నారు. మృతుడు గతంలో వీఆర్‌వోగా పనిచేసినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్

తలమడుగు, సెప్టెంబరు 2: మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని సోమవారం తహసీల్దార్ రాజమోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో గల సమస్యలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో ఎలాంటి వ్యాధులు సోకుండా ముం దస్తు చర్యలు చేపట్టాలని హాస్టల్ వార్డెన్ నరసింహులు ఆదేశించారు. అదే విధంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. వసతి గృహానికి ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుందని ఆయన తెలిపారు. కాగా బీసీవసతి గృహానికి ప్రహరీ లేక పాములు హాస్టల్‌లోకి వస్తున్నాయని, విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతా ధికా రుల దృష్టికి తీసుకెళ్లి ప్రహరీ నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వరద బాధితులు ఆందోళన చెందవద్దు

● బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి



జీఎస్ఆర్ కాలనీ సందర్శించిన బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లాలోని సోన్ మండలం జాఫ్రాపూర్‌తో పాటు నిర్మల్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ఆయన పర్య టించారు. ఈ సందర్భంగా వరద ముంపుకు గురైన బాధితులు ఆందోళన చెందవద్దన్నారు. అన్ని రకాలుగా తాము అండగా ఉంటామని మహేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇదివరకే అన్ని మండలాలలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆపత్కాలంలో ప్రతి ఒక్కరూ బాధితులకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.

జాఫ్రాపూర్ బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే ఏలేటి

సోన్: సోన్ మండలంలో భారీ వర్షాలతో వరద ఉధృతి కారణంగా నీట మునిగిన జాఫ్రాపూర్ బ్రిడ్జిని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమ వారం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

బీజేపీ భైంసా నాయకుడి సస్పెన్షన్

భైంసా, సెప్టెంబరు 2: పట్టణ బీజేపీ కమిటీ మాజీ అధ్యక్షుడు, నాయకుడు బాలాజీ సూత్రావేపై ఆ పార్టీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వే సింది. ఈ మేరకు సంబంధిత సస్పెన్షన్ ఉత్తర్వులను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి జారీ చేశారు. బాలాజీ సూత్రావే పార్టీ నియమ, నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా పార్టీ వ్యతిరేక కార్యక లాపాలకు చేపట్టినందుకు సస్పెండ్ చేసినట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అడవి పందులు

దస్తురాబాద్, సెప్టెంబరు 2 : మండలంలోని ఆకొండపేట గ్రామంలో మాడుగుల మల్లయ్య అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను ఆది వారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. మల్లయ్యకు చెందిన మొక్కజొన్న పంట అడవికి సమీపాన ఉండడంతో గత కొద్ది రోజులుగా తరచూ అడవి పందులు వస్తూ మొక్కజొన్నను ధ్వంసం చేస్తున్నాయని వాపోయాడు. చేతికి అందిన పంట పందుల పాలు కావడంతో ఆవేదన వ్య క్తం చేస్తున్నాడు. సంబంధిత శాఖ అధికారులు చొరవ చూపి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, ఆదే విధంగా రక్షణ కోసం సోలార్ పరికరాలను అం దించాలని రైతులు కోరుతున్నారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

దస్తురాబాద్, సెప్టెంబరు 2 : మండలంలోని గోదావరి పరివాహక ప్రాం తంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ సర్ప రాజ్ నవాజ్, ఎంపీడీవో కే. రమేష్ కోరారు. సోమవారం మండలంలోని గొడి సిర్యాల్ గ్రామ శివారులో ఉన్న గోదావరి నది తీర ప్రాంతాన్ని సం దర్శిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రెండు రోజులుగా భారీ వర్షా లు కురుస్తున్న నేపథ్యంలో కడెం ప్రాజెక్టు నుండి భారీగా వరద నీటిని విడుదల చేస్తున్నారన్నారు. దీంతో గోదావరి నది ఉధృతంగా ప్ర వహి స్తోందన్నారు. గోదావరి తీర ప్రాంతానికి ప్రజలు రావద్దని సూచిం చారు.

వర్షానికి కూలిన ఇల్లు

లోకేశ్వరం, సెప్టెంబరు 2 : లోకేశ్వరంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షా లకు ఆదివారం రాత్రి మండలంలోని హవర్గా గ్రామానికి చెందిన ఓడ్నాల భూమన్న ఇల్లు పూర్తిగా కూలిపోయింది. దీంతో కుటుంబం రోడ్డున పడింది. సోమవారం మండల ఆర్ఐ బాలకిషన్, మాజీ సర్పంచ్ భుజంగరావుతో కలిసి కూలిన ఇంటిని పరిశీలించి, పంచనామ నిర్వహించారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండండి

● ఖానాపూర్‌లో జిల్లా అధికారుల సమీక్షలో మంత్రి శ్రీధర్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

ఖానాపూర్, సెప్టెంబరు 2 : ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధి కారులు అందుబాటులో ఉండి ప్రజలకు సహా యక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశిం చారు. సోమవారం రాత్రి ఖానాపూర్‌లోని ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా అధికారులతో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిల వివరాలను అడిగి తెలు సుకున్నారు. మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పటి వరకు చేపట్టిన సహాయక చర్యల వివరాలను అడిగి తెలు సుకున్నారు. భారీ వర్షాల కారణంగా పారిశుద్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పారిశుద్య చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదే శించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ప్రజా ఆరో గ్యంపై దృష్టి సారించి పకడ్బందీ చర్యలు చేపట్టా లన్నారు. అధికారులంతా వారి వారి కార్యాల యాల్లో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉం డాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఖానాపూర్, పెంబి మండలాల్లో ఉన్న ఆయా వసతి గృహాలు, గురుకుల పాఠ శాలల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయా లని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లా లో వరదల్లో నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల చొప్పున నష్టపరిహారం అందజేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సం దర్భంగా జిల్లాలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల దృష్ట్యా నిర్మల్ జిల్లాలో హెల్త్ ఎమ ర్జెన్సీని ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభి లాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్‌వో భుజంగరావు, డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్, ముథోల్ ఆర్డీవోలు రత్న కళ్యాణ, కోమల్ రెడ్డి లతో పాటు స్థానిక మున్సిపల్ చైర్మన్ చిన్నంత సత్యం, తదితరులున్నారు.

● మంత్రి సాక్షిగా సతుల స్థానంలో పతులు

రాష్ట్ర మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి రివ్యూ సమావేశంలో కొంత మంది స్థానిక నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. కొంతమంది స్థానిక కౌన్సిలర్ల భర్తలు వేదికపై ఆసీనులై కనిపించారు. సదరు కౌన్సిలర్ల భర్తలు జిల్లాస్థాయి అధికారిక సమీక్ష సమా వేశంలో వేదికపై కూర్చోవడం పట్ల పలు విమ ర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వర్షాలకు నిలిచిన రాకపోకలు

బాసర, సెప్టెంబర్, 2 : బాసర మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు రాకపో కలు నిలిచిపోయాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానతో వాగు పొంగి పలు గ్రా మాలకు సంబంధాలు తెగిపోయాయి. కిర్గుల్ (బీ), కిర్గుల్ (కె), ఓని, కౌట, సాలాపూర్, సావర్గాంతో పాటు ఇతర మండల గ్రామా లకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

లోకేశ్వరం:ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం రాత్రి మండలంలోని హవర్గా గ్రామానికి చెందిన ఓడ్నాల భూ మన్న ఇల్లు పూర్తిగా కూలి పోయింది. దీంతో కుటుంబం రోడ్డున పడింది. సోమవారం మండల ఆర్ఐ బాలకిషన్, మాజీసర్పంచ్ భు జంగరావుతో కలిసి కూలిన ఇంటిని పరిశీలించి, పంచనామ నిర్వహిం చారు. దా దాపు రూ. 1,50,000 ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆర్ఐ బాలకిషన్ తెలిపారు.

దిలావర్‌పూర్ :మండల తహసీల్దార్ బి. స్వాతి, ఎంపీడీవో అరుణ రాణి, ఎంఆర్ఐ చింత సంతోష్ బృందం మండలంలోని అన్ని గ్రామాలను సందర్శించి ప్రజలకు ఇబ్బం దులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. దిలావర్‌పూర్‌లో వర్షాలకు దెబ్బతిన్న రెండు ఇళ్లను సందర్శించారు. మండలంలో భారీ వర్షం కురిసింది. అయితే ఈ వర్షం మూడు కుటుం బాలను రోడ్డున పడేసింది. దిలావర్‌పూర్‌లో రెండు ఇళ్లు నేలమట్టం కా గా, కాల్వలో ఒక ఇళ్లు పాక్షికంగా దెబ్బ తింది.

మామడ : మండలంలోని నల్దుర్తి గ్రామ సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువుదీరిన భీమన్న ఆలయంలో సోమ వారం జాతర నిర్వహించాల్సి ఉంది. వాగు ఉప్పొంగడంతో భక్తులు వెను దిరిగి ఇంటికి వెళ్లారు. కేవలం నిర్వాహకులు మాత్రమే వా గు దాటుకుంటూ వెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కాలనీని కాపాడాలని యువకుడి నిరసన

● బిల్డింగ్ పైనుండి దూకిన వైనం



చికిత్స పొందుతున్న హరీష్

నిర్మల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఏటా నీట మునుగుతున్న తమ జీఎస్ఆర్ కాలనీని ఏ ఒక్క ప్రజాప్రతినిధి గాని అధికారులు గాని పట్టిం చుకోవడం లేదని మిట్ట పల్లి హరీష్ అనే యువ కుడు గట్టి అరుస్తూ ఇం టి భవనం పైనుంచి కిం దికి దూకాడు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. స్థానికులు యువకుడిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు చికిత్సలు చేస్తున్నారు. హరీష్ మాట్లాడుతూ... దాదాపు ఐదే ళ్ల నుంచి తమ కాలనీ ముంపు గురవుతూనే ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ముంపు సమయంలో వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప తమ సమస్యను పరిష్కరించడం లేదంటూ వాపోయారు. తమ సమస్యను వెంటనే పరిష్క రించాలని కోరారు.

ఘనంగా పొలాల అమావాస్య

తానూర్, సెప్టెంబరు 2 : మండలవ్యాప్తంగా సోమవారం పొలాల అమావాస్య ఘనంగా నిర్వ హించారు. రైతులు తమ బసవన్నలను అందం గా ముస్తాబు చేసి గ్రామంలోని హనుమాన్ ఆ లయం వద్దకు తీసుకెళ్లి చుట్టు ప్రదక్షిణలు వే యించారు.

కుంటాల : మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం పొలాల అమావాస్య పండగను జరుపుకున్నారు. రైతులు ఉదయాన్నే తమ ఎద్దులను చెరువులకు తీసుకెళ్లి శుభ్రం చేసి ఇంటికి తీసుకవచ్చి అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లోకేశ్వరం : మండల కేంద్రం లోకేశ్వరంతో పాటు ధర్మోరా, కిష్టాపూర్, మన్మద్, గడ్‌చందా, పిప్రి, తదితర గ్రామాల్లో పొలాల అమావాస్య పురస్కరించుకొని సోమవారం పండుగను రైతు లు ఘనంగా జరుపుకున్నారు. మొదట ఎద్దులను, ఆవులను రైతులు నీటితో శుభ్రం చేసి రంగులు వేశారు. అనంతరం గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల చుట్టూ ఎద్దులను ప్రదక్షిణలు చేయించారు.

భైంసా :డివిజన్ పరిధిలోని అన్నదాతలు సోమవారం పొలాల అమావాస్య పండుగను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ఆయా కాల నీలకు చెందిన చెందిన రైతన్నలు తమ తమ బసవన్నలను శోభయమానంగా అలంకరించారు. సాయంత్రం వేళలో ఆయా ప్రాంతాల్లోని హన్మా న్ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టి బసవ న్నలను ఆలయాల చుట్టు ప్రదక్షిణలు నిర్వహిం పచేశారు. కిసాన్‌గల్లిలోని హన్మాన్ మందిరం వద్ద పూజలు నిర్వహించారు.

పురస్కార గ్రహీతలకు సన్మానం

నిర్మల్‌కల్చరల్, సెప్టెంబరు 2 : ఇటీవల షార్ట్ ఫిలిం ఫోక్ సాంగ్ ఉత్త మ నిర్మాతగా వీకేఆర్ పురస్కారాన్ని అందుకున్న మన్నెపు శోభారాణి, గిడుగు పురస్కార గ్రహీత కవి తుమ్మల దేవరావును సోమవారం ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ సన్మానించింది. డాక్టర్ యూ.కృష్ణంరాజు, టీఎన్జీవో అధ్య క్షుడు ప్రభాకర్, సొసైటీ అధ్యక్షుడు అన్సార్ పాషా, పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారు : మాజీ ఎంపీపీ

కుంటాల, సెప్టెంబర్, 2 : గతంలో పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండి వారు చేపట్టనటువంటి పనులను ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ చేపట్టేందుకు కృషిచేస్తుంటే కొందరు నాయకులు లేనిపోని విమర్శ లు చేస్తున్నారని కుంటాల మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ అన్నా రు. మండల కేంద్రం కుంటాల ప్రజాపరిషత్ కార్యాలయంలో గత నెల 29 న ఎమ్మెల్యే పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా మాజీఎంపీపీగా తనతో పాటు పలువురు నాయకులం కలిసి ఎమ్మెల్యేకు మండల సమస్యలను వివరించామని, దీనిని జీర్ణించుకోలేక కొన్ని పార్టీల రాజకీయ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని అన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

భైంసా, సెప్టెంబరు 2 : పట్టణంలో ఉర్సు ఉత్సవాలు సోమవారం ఘనం గా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియ ర్ కళాశాల ప్రాంతంలోని నిజామోద్దీన్ నివాసగృహం నుంచి బడా పహడ్ వరకు శోభాయాత్ర కొనసాగింది. ఉదయం వేళలో ఉత్సవ ప్రతినిధులు మ హ్మద్ మజారోద్దీన్ ఖాద్రీ, మహ్మద్ అరిపోద్దీన్ ఖాద్రీ, మహ్మద్ సలావోద్దీన్ ఖాద్రీల సారథ్యంలో శోభయాత్ర కొనసాగింది. ఇందులో పట్టణ పరిధిలోని ఆయా కాలనీలకు చెందిన ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉర్సు ఉత్సవ సమితి ప్రతినిధుల సారథ్యంలో ముస్లింలు శోభాయాత్రగా తరలి వెళ్లి చాదర్ సమర్పించారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం

నిర్మల్‌కల్చరల్, సెప్టెంబరు 2 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు సందర్శనకు సోమవారం నిర్మల్ వచ్చిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు ఘన స్వాగతం పలికారు. గంజాల్ టోల్‌ప్లాజా వద్ద శ్రేణులతో కలిసి శ్రీహరి రావు మంత్రికి స్వాగతం పలికారు. నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

నర్సాపూర్ (జీ), సెప్టెంబరు 2 : ప్రమాదవశాత్త బావిలో పడిఒకరు మృతిచెందారు. మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన ఆర్.వెంకటేష్ (24) ఆదివారం ఉదయం 10 గంటల నుంచి కనిపించడం లేదని అతడి తండ్రి ఆర్.గంగాధర్ సోమవారం ఉదయం నర్సాపూర్(జీ) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేశారు. ఎస్సై మునిగెల హన్మాండ్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. కోస్లీ గ్రామ శివారులోని వ్యవసాయ భూమికి చేరుకొని కు టుంబ సభ్యులు, గ్రామస్తులతో వెతకగా బోడ బావిలో మృతదేహం కనిపించింది. బావికి ఎలాంటి పిట్ట గోడ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడినట్లు మృతుడితండ్రి పేర్కొన్నారు. ఈత రాక నీళ్లలో మునిగి చనిపోయి ఉండవచ్చని స్థానికులన్నారు. గజ ఈతగాళ్లతో శవాన్ని తీయించి, పోస్టుమార్టం కోసం భైంసా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



● జైనథ్‌లో పత్తి పంటను ముంచెత్తిన పెన్‌గంగా వరదనీరు

● ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగా నది



వానలే.. వానలు!

- జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగా నది
- నీట మునిగిన పంటపొలాలు
- పలుచోట్ల తెగిన రోడ్లు, కల్వర్టులు.. రాకపోకలు బంద్
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు
- మరింత అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు
- మరో 48గంటల పాటు భారీ వర్ష సూచన
- జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ స్తంభించిన జనజీవనం!!

ఆదిలాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లావ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. రెండవ రోజు కూడా ఏకధాటిగా వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఓమోస్తారు స్థాయిలో వర్షం కురుస్తునే ఉంది. ఉదయం 8.30గంటల వరకు జిల్లా సగటున 48.5మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఉట్నూర్ మండలంలో 169.5 మి.మీ.లు, సిరికొండలో 121.8, ఇంద్రవెల్లి 112.3, నార్నూర్ 82.5, గాదిగూడ 55.8, బేల 52.8, నేరడిగొండ 41.5, బోథ్‌లో 31.8 మి.మీల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నెం.18004251939, ఆర్అండ్‌బీ కంట్రోల్ రూమ్ నెంబర్ 8106128195, ఇరిగేషన్ కంట్రోల్ రూమ్ నెం. 91873226050కు సంప్రదించాలని సూచిస్తున్నారు. కురుస్తున్న భారీ వర్షాలకు కుంటాల, పొచ్చెర, కనకాయి, గాయత్రి జలపాతాలు వరదనీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. మరో 48గంటల పాటు జిల్లాకు భారీ వర్షసూచన ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వర్షం కారణంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి అంతంత మాత్రంగానే ఆదరణ కనిపించింది. జిల్లా కలెక్టర్ రాజర్షిషా జిల్లా ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి పెన్‌గంగా పరివాహక ప్రాంతంలోని పలు ముంపు గ్రామాలను పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దంటూ హెచ్చరికలు చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ రాజర్షిషా అప్రమత్తం చేశారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

మరో 48 గంటల పాటు జిల్లాకు వర్ష సూచన

: శ్రీధర్ చౌహాన్, సీనియర్ శాస్త్రవేత్త, ఆదిలాబాద్

జిల్లాలో మరో 48గంటల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవడంతో పిడుగులు పడే ప్రమాదం ఉంది. రైతులు అప్రమత్తంగా ఉండాలి. పంటచేలలో వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పంట ఎరువుభారీనట్లయితే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి నివారణ చర్యలు చేపట్టాలి. రైతులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు వర్షపు నీటిని తీసివేసేలా చర్యలు తీసుకోవాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

పెన్‌గంగా ఉగ్రరూపం

జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నదికి భారీ వరదలు రావడంతో ఉగ్రరూపం దాల్చింది. మహారాష్ట్రలోని ఇసాపూర్ డ్యాం వరద గేట్లను ఎత్తి వేయడంతో పెన్‌గంగా నదికి వరద ప్రవాహం భారీగా పెరిగింది. జైనథ్ మండలంలోని కోర్టా-చనకా బ్యారేజీ వద్ద పెన్‌గంగా నదిలో సుమారుగా రెండు లక్షల క్యూసెక్కుల వరకు వరద నీరు దిగువకు వెళ్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. పెన్‌గంగా బ్యాక్‌వాటర్‌తో భీంపూర్, తాంసి, జైనథ్, బేల మండలాల్లోని పలు గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా జైనథ్ మండలంలోని కామాయి, ఆనంద్‌పూర్, కాప్రి, కరంజి, బహదూర్‌పూర్, బేల మండలంలోని మణియార్‌పూర్, కాప్రీ, డోప్టాల, దేగామా గ్రామాల పరిధిలోని పంట చేన్లను పెన్‌గంగా వరదలు ముంచెత్తాయి. గత 24గంటల నుంచి పత్తి, సోయా, కంది, మొక్కజొన్న పంటలు వరద నీటిలోనే కనిపిస్తున్నాయి. పెండల్‌వాడ, కామాయి, సాంగ్వి గ్రామాలను వరదనీరు చుట్టుముట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నారు. సోమవారం పెన్‌గంగా వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం, ఎమ్మెల్యే పాయల శంకర్ పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు. ఎగువన ఉన్న మహారాష్ట్ర ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు.

కోతకు గురైన రోడ్లు

గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, బేల, సిరికొండ ఏజెన్సీ మండలాల్లో వర్షం బీభత్సవాన్ని సృష్టించింది. పంచాయతీరాజ్ పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే 10 కల్వర్టులు వరద నీటికి ధ్వంసమయ్యాయి. అలాగే ఉట్నూర్-లక్షెటిపేట్, ఆదిలాబాద్-చిచ్‌ధరి ఖానాపూర్ వెళ్లే రోడ్డు మార్గాలు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పంచాయతీరాజ్ శాఖకు సుమారుగా రూ.40లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో పలు రోడ్లు, కల్వర్టులు వరద నీటికి తీవ్రంగా దెబ్బతినడంతో రూ.30లక్షల వరకు నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. విద్యుత్ శాఖ పరిధిలో 56 విద్యుత్ స్తంభాలు నేలకొరగగా రూ.7లక్షల వరకు నష్టం జరిగి ఉండవచ్చునని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా 1849 ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. ఇందులో పత్తి 1559 ఎకరాలు, సోయా 220 ఎకరాలు, కంది 25 ఎకరాలు, మొక్కజొన్న 45 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కువగా పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలోని గ్రామాలలోనే పంట నష్టం అధికంగా కనిపిస్తోంది. ఇంకా పెన్‌గంగా నది వరదల్లోనే పంటలు మునిగి కనిపిస్తున్నాయి.

నిండుకుండలా జలాశయాలు

జిల్లాలో అధిక వర్షపాతమే నమోదు కావడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతొంది. దీంతో జలాశయాలు నిండుకుండలా కనిపిస్తున్నాయి. సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టులతో పాటు చిక్‌మాన్ ప్రాజెక్టు, దేగామ, కరత్వాడ ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నాయి. జిల్లా సాధారణ వర్షపాతం 847.5 మి.మీ.లు కాగా ఇప్పటి వరకు 967.0 మి.మీ.ల అధిక వర్షపాతం నమోదు కావడంతో 14.0మి.మీ.ల వర్షం అధికంగా కురిసింది. దీంతో చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. అలాగే ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో ముందు జాగ్రత్తగా గేట్లను ఎత్తి దిగువకు వరద నీటిని వదిలేస్తున్నారు. సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 285.90 మీటర్లకు చేరింది. అలాగే మత్తడివాగు ప్రాజెక్టు నీటిమట్టం 276.90 మీటర్లకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తు న్న భారీ వరదనీటిని అంచనా వేస్తూ ముందు జాగ్రత్తగా నీటిని వదిలేస్తున్నా రు. ప్రాజెక్టుల దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేస్తున్నారు. కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు నిండుకోవడంతో ఏక్షణంలోనైనా వరదగేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. మత్తడిదూకి ప్రవహించడంతో పంటచేలను వరదనీరు ముంచెత్తుతోంది.

జిల్లాలో ఈనెల 2వరకు వర్షపాతం ఇలా..

మండలం పేరు	కురవాల్సింది	కురిసింది
1. భీంపూర్	752.1	883.4
2. జైనథ్	883.0	844.9
3. బేల	860.2	860.5
4. గాదిగూడ	849.9	914.8
5. నార్నూర్	869.8	855.1
6. ఇంద్రవెల్లి	951.7	1235.7
7. గుడిహత్నూర్	780.3	1109.9
8. ఆదిలాబాద్‌రూరల్	859.0	1185.4
9. ఆదిలాబాద్‌అర్బన్	859.8	1265.1
10. మావల	844.6	804.0
11. తాంసి	795.6	1046.2
12. తలమడుగు	810.0	832.4
13. బజార్‌హత్నూర్	864.0	917.4
14. బోథ్	803.4	814.8
15. నేరడిగొండ	822.4	733.5
16. ఇచ్చోడ	843.2	926.9
17. సిరికొండ	886.3	948.0
18. ఉట్నూర్	919.4	1137.9



● జిల్లాకేంద్రంలో రాత్రి వేళలోనూ కురుస్తున్న వర్షం

జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం

ఆదిలాబాద్ అర్బన్: ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం కూడా ఏకధాటిగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఓ మోస్తారుస్థాయిలో వర్షం కురుస్తునే ఉంది. కాగా వర్షంధాటికి పలు కాలనీల రోడ్లు గుంతలమయం కావడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కురుస్తున్న వర్షాలకు కాలనీలోని రోడ్డుపై అడుగడుగున గుంతలు ఏర్పడ్డాయి. వర్షపునీరు నిల్వ ఉండడంతో వాహనదారులు భయం భయంగా వెళ్తున్నారు. కాగా కురుస్తున్న వర్షాలకు పంటచేలు నీట మునిగాయి.దీంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అధికారులు అప్రమత్తమయ్యారు. కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతాలన్నీ వరదనీటితో పరవళ్లు పెడుతున్నాయి. మరో రెండు రోజుల పాటు జిల్లాకు భారీ వర్షసూచన ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.



● బేల మండలంలో కోతకు గురైన కల్వర్టు బ్రిడ్జి, పరిశీలిస్తున్న దేవుజిగూడ గ్రామస్థులు



● జైనథ్ మండలంలో లోలెవల్ వంతెన దాటి వెళ్లకుండా కట్టడి చేస్తున్న పోలీసులు



పెన్‌గంగా వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం

వరదలపై జిల్లా ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

జైనథ్, సెప్టెంబరు 2: జిల్లాలోని ఆయా గ్రామాల్లో అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వరదలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంలు అన్నారు. సోమవారం మండలంలోని సరిహద్దున గల డొల్లార వద్ద పెన్‌గంగా వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ మండలంలోని పెన్‌గంగా పరివాహక గ్రామాల ప్రజలను వరదల వల్ల ఎలాంటి హాని కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మండల ఉన్నత అధికారులకు సూచించారు. దీంతో పాటు జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామ సరిహద్దున గల మహారాష్ట్ర దిగిరిషా, ఆనంద్‌పూర్ బ్రిడ్జిపై పెన్‌గంగా నది ప్రవహించడం వల్ల రాకపోకలను పూర్తిగా నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటు ఆనంద్‌పూర్ దిగిరిషా బ్రిడ్జి వద్ద ప్రమాద హెచ్చరికను పెట్టాలని సూచించారు. అనంతరం కామాయి గ్రామం వద్ద లోలెవల్ బ్రిడ్జి ద్వారా రాకపోకలు బంద్ కావడంతో కలెక్టర్, జిల్లాఎస్పీ కామాయి గ్రామ ప్రజలతో ఫోన్ ద్వారా మాట్లాడుతూ గ్రామస్థులకు సకాలంలో రేషన్ సరుకులను అందించని జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్‌పై అసహం వ్యక్తం చేశారు.

జిల్లాలో ఘనంగా బసవన్నల పండుగ

● పొలాల అమావాస్య సందర్భంగా ఎడ్లకు ప్రత్యేక అలంకరణ, పూజలు ● గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు

పొలాల అమావాస్య.. పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా బసవన్నల పండుగను నిర్వహించారు. సోమవారం జిల్లావ్యాప్తంగా పొలాల పండుగను రైతన్నలు సంబురంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే రైతులు బసవన్నలను అందంగా ముస్తాబు చేసి సాయంత్రం వేళల్లో ఎద్దులకు ప్రత్యేక అలంకరణ చేసి భాజా భజంత్రీలతో గ్రామంలోని హనుమాన్ ఆలయాల చుట్టు ఊరేగింపుగా బసవన్నలతో ప్రదక్షిణలు చేశారు. అతేకాకుండా నమో పార్వతి.. హరహర మహాదేవ అంటూ నినాదాలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. రైతులు ఎవరికి తోచిన విధంగా వారు పప్పు పోలెల బూరెలు, తీపి వంటకాలను చేసుకుని ఆలయాల వద్ద నైవేద్యాన్ని బసవన్నలకు సమర్పించారు. ఈ యేడు సమృద్ధిగా వర్షాలు కురియడంతో పంటలు ఆశాజనకంగా ఉండడంతో ఆయా మండలాలకు చెందిన రైతులు రెట్టింపు ఉత్సాహంతో పొలాల అమావాస్య పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు.

(- ఆదిలాబాద్ న్యూస్ నెట్‌వర్క్)



జైనథ్‌లో బసవన్నలతో శివపార్వతుల వేషధారణలో చిన్నారులు



తాంసి హనుమాన్ మందిరం వద్ద బారులు తీరిన బసవన్నలు



నేరడిగొండలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దంపతులు



దీపాయిగూడలో నైవేద్యం పెడుతున్న జోగు రామన్న దంపతులు



హస్నాపూర్‌లో ఎడ్లతో హనుమాన్ మందిరం చుట్టూ ప్రదక్షిణలు



తలమడుగు మండలం బరంపూర్‌లో బసవన్నలతో ఊరేగింపు



గుడిహత్నూర్ మండలం తోషంలో హనుమాన్ ఆలయం చుట్టూ ఎడ్లతో ప్రదక్షిణలు



బోథ్ మండలం కౌటా(బి) గ్రామంలో బసవన్నలను ఊరేగిస్తున్న రైతులు

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

● జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 2: న్యాయ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని జిల్లా కోర్టు ఆవరణలో గల జిల్లా జడ్జి చాంబర్‌లో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సౌజన్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి మాట్లాడారు. కోర్టుల్లోని కేసులు రాజీపడడం ద్వారా ఇద్దరు గెలిచి సమస్య పరిష్కారం అవుతాయన్నారు. ఈసారి 3,550 కేసులను పోలీసులు, బ్యాంక్, ఇన్సూరెన్స్ అధికారులతో సమావేశం నిర్వహించి గుర్తించామన్నారు. ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్‌ఆదాలత్‌లో అత్యధికంగా కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కక్షిదారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.